సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వన్యప్రాణి సంరక్షణపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న జూ క్యూరేటర్ మంగమ్మ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం మహిళలకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఇక్కడ శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు వన్యప్రాణులపై అవగాహనలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం జూలో వన్యప్రాణి సంపద, విభిన్నమైన వృక్ష సంపద గురించి క్యూరేటర్ మంగమ్మ మహిళలకు వివరించారు. శుక్ర, శనివారాలు సముద్ర జీవులు–వాటి సంరక్షణ, బర్డ్ వాక్–పక్షుల జీవవైవిధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

పైడిమాంబకు పూజలు



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: పాత డెయిరీఫారం వద్ద పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కలశాలతో రవీంద్రనగర్ నుంచి బయలుదేరి వివేకానందనగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్ మీదుగా డెయిరీఫారం వద్ద అమ్మవారి గుడికి మంగళవాయిద్యాలతో చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి జలాభిషేకం, సామూహిక పూజలు నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మంగళవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా జాతర, పరస జరగనున్నాయి.

ఈ వాహనాలు ఎవరివో..?



హనుమంతవాక బస్ స్టాప్ వద్ద నిలిపి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు

ఆరిలోవ: జాతీయ రహదారిపై మధురవాడ వైపు వెళ్లే హనుమంతవాక బస్ స్టాప్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు కొద్ది రోజులుగా నిలిపి ఉన్నాయి. ఇవి ఎవరివో, వీటిని ఇక్కడ ఎవరు నిలిపి వెళ్లారో తెలియడం లేదు. బస్ స్టాప్ వద్ద ముగ్గురు అమ్మవార్ల గుడులు పక్కన ఒక బైక్, స్కూటీని సుమారు రెండు వారాలకు పైగా నిలిపి ఉన్నట్లు రోడ్డు శుభ్రం చేసే పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు. ఇవి ఇక్కడ రోడ్డు శుభ్రం చేయడానికి ఆటంకంగా ఉన్నాయని తెలిపారు. వాహనాలు పూర్తిగా దూళి పట్టాయి. వీటిని ఎవరు ఎక్కడ నుంచి తీసుకొచ్చి ఇక్కడ వదిలేశారంటూ స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ వాహనాలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్ విలేజ్ వార్డు సెక్రటేరియట్ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎనర్జీ అసిస్టెంట్ (జేఎల్ఎం–గ్రేడ్2) కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. సీతమ్మధారలోని ఏపీఎస్ఈబీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమం అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పి. రాజు, స్టేట్ సంయుక్త కార్యదర్శి విక్రమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ఎనర్జీ అసిస్టెంట్లు హాజరయ్యారు. డిస్కాం ప్రెసిడెంట్ ఎస్. శ్రీనివాసరావు, కోశాధికారి రవీంద్రతో పాటు జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడు నారాయణ మధు, వైస్ ప్రెసిడెంట్ బి. రాజేష్, సెక్రటరీ పి. శ్రీకాంత్, కోశాధికారి శివసాయి, సంయుక్త కార్యదర్శి సీహెచ్ గోవింద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లు, జేఎల్ఎం గ్రేడ్–2లు ఎదుర్కొంటున్న సమస్యలపై నూతన కార్యవర్గ సభ్యులందరూ చర్చించి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

నో పార్కింగ్ బోర్డుల చుట్టూ వాహనాలే..

ఈ మార్గంలోనే ఎక్కడికక్కడ ట్రాఫిక్ పోలీసులు నో పార్కింగ్ సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. వాహన చోదకులు వాటి వద్దే తమ వాహనాలు నిలుపుతూ ట్రాఫిక్ నిబంధనలు మీరుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలను ఆ బోర్డుల చుట్టే పార్క్‌చేసి హోటళ్లు, మాల్స్‌లోకి వెళ్తున్నారు. రామ్‌నగర్ నుంచి సిరిపురం సర్కిల్ వైపు వెళ్లే మార్గంలో నో పార్కింగ్ బోర్డు వద్ద కార్లు, బైకులను నిలిపి ఉంచుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు మాత్రం తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు..

ఇష్టానుసారంగా పార్కింగ్



సిరిపురం సర్కిల్ నుంచి రామ్‌నగర్ వైపు వెళ్లే రోడ్డుపై పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాలు

రామ్‌నగర్ రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు

నిబంధనలు మీరి వాహనాల నిలుపుదల

చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు



బస్ స్టాప్‌ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలు



రాంగ్ పార్కింగ్‌లో ద్విచక్ర వాహనాలు



రామ్‌నగర్-సిరిపురం సర్కిల్ రహదారిలో నో పార్కింగ్ బోర్డు వద్ద కార్లు

బీచ్ రోడ్డు: నిరంతరం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రామ్‌నగర్–పెదవాల్తేరు మెయిన్ రోడ్డుపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ రహదారి మీద నో పార్కింగ్ అని సైన్ బోర్డులు పెట్టినా సరే.. అక్కడే వాహనాలు నిలుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పలువురు వాహన చోదకులు సవాల్ విసురుతున్నారు.

సాయంత్రం వేళల్లో ఇబ్బందులు

రామ్‌నగర్ నుంచి పెదవాల్తేరు వైపు వెళ్లే మార్గంలో నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిలోనే అనేక స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, చిన్నపిల్లల బొమ్మల షాపులు, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ ఉన్నాయి. వాహన చోదకులు రోడ్డుపైనే వారి వాహనాలను పార్క్‌చేసి ఇక్కడి మాల్స్, షాపుల్లోకి వెళ్లి వస్తుంటారు. ముఖ్యంగా కేర్ హాస్పిటల్ నుంచి ద్రోణంరాజు సర్కిల్ వరకు ఈ వాహనాలు నిలిపి ఉంటున్నాయి. దీంతో సాయంత్రం సమయంలో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

వీఐపీలు ప్రయాణించే మార్గంలో..

ద్రోణంరాజు సర్కిల్ నుంచి రామ్‌నగర్ వైపు వెళ్లే రోడ్డు మీద వాహనాలు బారులు తీరుతున్నాయి. ఇక్కడ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉండటంతో ద్విచక్ర వాహనాలను భారీ సంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారు. చివరికి ఇక్కడి బస్ స్టాప్‌లను సైతం పార్కింగ్ స్థలంగా వాహన చోదకులు వినియోగించుకుంటున్నారు. నిజానికి ఈ మార్గంలోనే నగరానికి వచ్చే ప్రముఖులందరూ ప్రయాణిస్తుంటారు. ప్రభుత్వ అతిథి గృహానికి.. పోర్టు అతిథి గృహానికి.. నావికాదళ అధికారుల అతిథి గృహానికి.. బీచ్ రోడ్‌లోని స్టార్ హోటళ్లకు వీఐపీలు రాకపోకలు కొనసాగిస్తూనే ఉంటారు.. అటువంటి ఈ రహదారిపై వాహనాలను ఇష్టమొచ్చినట్లు పార్క్‌చేస్తున్నా.. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో రాంగ్ పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

కృష్ణా కళాశాలలో నేడు జాబ్‌మేళా

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. దివీస్ లేబరేటరీస్ లిమిటెడ్‌లో ఉద్యోగ నియామకాల కోసం జరగనున్న ఈ జాబ్ డ్రైవ్ కేవలం పురుషులకు మాత్రమేనని చెప్పారు. ముఖ్యంగా బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, బీటెక్ కెమికల్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఎన్లిటికల్ కెమిస్ట్రీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఒక సువర్ణ అవకాశమన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, ఉచిత యూనిఫాం, పీఎఫ్, ఈఎస్ఐ, రాయితీతో కూడిన భోజన సదుపాయం, జీతంతో పాటుగా కల్పించనున్నారని తెలిపారు. కనీస జీతం రూ.18,000, గరిష్ట జీతం రూ. 24 వేలుగా ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులందరూ ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలను పొందాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, వివిధ ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

అద్భుతంగా యామిని కూచిపూడి రంగప్రవేశం



కూచిపూడి నృత్యంతో అలరిస్తున్న యామిని

మద్దిలపాలెం: నృత్యకారిణి యామిని కూచిపూడి నృత్యంలో రంగప్రవేశం చేశారు. సిద్ధేంద్ర యోగి కళా నిలయం గురు ఎస్.ఎస్.వి.సత్యభాను వద్ద 15 ఏళ్లుగా రాష్ట్ర సంప్రదాయ నాట్యం కూచిపూడిని అభ్యసిస్తూ, సర్టిఫికేట్ కోర్స్ డిప్లమో కోర్స్ ఇన్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పాసై అనేక ప్రతిష్టాత్మకమైన ప్రదర్శనలు ఇచ్చిన ఆమె ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో కూచిపూడి నృత్యంతో అలరించారు. ముఖ్య అతిథి చార్టెడ్ అకౌంటెంట్ చంద్రశేఖర్, కళాభారతి కార్యదర్శి డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్ రాంబాబు, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతా రవి బాలకృష్ణ, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురు హరిరామ్మూర్తిల సమక్షంలో అద్భుతమైన కూచిపూడి నాట్యముద్రికల నడుమ ఆమె కూచిపూడి రంగప్రవేశం చేశారు. ఈ సందర్భంగా యామిని చేసిన నాట్యం అతిథులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం ఆమెను ఆశీర్వదించి నాట్య సౌదామిని అవార్డుతో సత్కరించారు. యామిని సిద్ధేంద్ర యోగి కళా నిలయం ఫౌండర్ డైరెక్టర్ ఎస్.ఎస్.వి.సత్యభాను గురుపూజోత్సవం చేశారు. ఈ రంగ ప్రవేశ కార్యక్రమానికి గాత్రం డి.ఎస్.వి. శాస్త్రి, మృదంగం రాజాగోపాల ఆచార్య, వయొలిన్ ఎమ్మెస్ నీలాద్రి, వీణ శశిధర్, ఫ్లూట్ వి.బి.ఎస్.మురళి, మేకప్ ధరణి, దుస్తులు కూర్మారావులు సహకరించారు.

ఉత్సాహంగా 'సిడ్నీ తెలుగు సీనియర్స్' సమావేశం



ఆత్మీయ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు

విశాఖ విద్య: సిడ్నీ తెలుగు సీనియర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశాన్ని 52వ వార్డు మద్రిపాలెం వుడా లేఅవుట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మందలపు వాసుదేవరావు ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎస్.పి.డి.వి.సాయిబాబా అధ్యక్షతన ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ సిడ్నీ తెలుగు సీనియర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన పి.ఆర్.విజయ్ కుమార్ ఎంతో శ్రమించి 250 మంది సభ్యులకు సంబంధించి రూపొందించిన అడ్రస్ డైరీని గణబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు తమ అనుభవాలను పంచుకున్నారు. సమావేశానికి కీలక పాత్ర పోషించిన వాసుదేవరావును అభినందించారు. కార్యక్రమంలో బి.మల్లికార్జునరావు, మస్తాన్ రావు, జె.సుధాకర్, జి.మురళీమోహన్, ఎ.శ్రీరాములు, ఆర్.అప్పారావు, రామకోటేశ్వరరావు, నేతి శ్రీనివాసరావు, రాధాకృష్ణ (చెన్నై), టి.బి.రాజేంద్రప్రసాద్, ఉపేంద్ర, పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలి



పోర్టు ఆస్పత్రి వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రిని సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని, ప్రైవేటీకరణకు ఒప్పుకునేది లేదని సీఐటీయూ పోర్ట్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు తెలిపారు. పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు 160వ రోజుకు చేరాయి. ఆదివారం జరిగిన దీక్షలో పాల్గొన్న పద్మనాభరాజు మాట్లాడుతూ పోర్టుకు ఈ సంవత్సరం సుమారు రూ. 800 కోట్లు లాభాలు వచ్చాయని, పోర్టు వద్ద రిజర్వు ఫండ్లు, వేల ఎకరాల భూములు ఉన్నాయని తెలిపారు. అయినా ప్రైవేటీకరించాలనే నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. కొన్ని వేల మంది ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కె. సత్యనారాయణ, జె. సత్యనారాయణ, బి. జగన్, రామలింగేశ్వరరావు, రాఘవులు, నాయుడు, సీహెచ్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా పోటీల్లో గైస్ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా డిపార్టుమెంట్ ఆఫ్ ఫ్యాక్టరీ నిర్వహించిన భద్రతా ప్రమాణాలపై నిర్వహించిన పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగులో భద్రతా నినాదాలు అనే అంశంలో గైస్‌కు చెందిన టి.స్వామినాథన్ ప్రథమ బహుమతి, ఆంగ్లంలో ఎస్.సాగర్ కుమార్ ద్వితీయ బహుమతి, వర్క్ షాప్ మెషినరీ సేఫ్టీ చిత్రలేఖన పోటీలో జి.కుసుమ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. వీరిని గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అభినందించారు.

బ్రహ్మజీరావు స్మారక పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రభావతి దంపతులు

సీతంపేట: విశాఖ సాహితీ, ఘండికోట సాహితీ పీఠం సంయుక్తంగా ఘండికోట బ్రహ్మజీరావు, సీతారామమ్మ స్మారక సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. విశాఖ సాహితీ అధ్యక్షులు కోలవెన్ను మలయవాసిని అధ్యక్షతన జరిగిన సభలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రభావతి దంపతులకు ముఖ్య అతిథి, ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు చేతుల మీదుగా పురస్కారం అందజేశారు. పురస్కార గ్రహీతలు బ్రహ్మజీరావు కుటుంబంతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త అయ్యగారి సీతారత్నం 'బ్రహ్మజీరావు గారి కథలు, స్త్రీ పాత్రలు' అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజకుమారి, భమిడిపాటి సుబ్బారావు, డి.వి.సూర్యారావు, విశాఖ సాహితీ కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, ఘండికోట విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘన సత్కారం



జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరిస్తున్న వాప్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఇటీవల రాజస్థాన్ ఆళ్వార్‌లో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటిన విశాఖ క్రీడాకారులను వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం (వీఏఏవీ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–8లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడాకారులకు ముఖ్య అతిథి వాప్ చీఫ్ పేట్రన్, వాకర్స్ ఇంటర్నేషనల్ ఇంద్రడోనర్ కమల్ బయిద్ జీ మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటడం అభినందనీయమన్నారు. త్వరలో మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో సైతం ప్రతిభ చూపి విశాఖకు మంచి గుర్తింపు తేవాలని కోరారు. వాప్ కన్వీనర్ నండూరి రామకృష్ణ మాట్లాడుతూ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో వాప్ ద్వారా 33 మంది విశాఖ క్రీడాకారులు పాల్గొని 13 స్వర్ణం, 16 రజత, 14 క్యాంస పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాప్ తరపున వారిని సత్కరించామన్నారు. కార్యక్రమంలో ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ సెక్రటరీ జనరల్, వాప్ అధ్యక్షుడు మంగ వరప్రసాద్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

- ప్రథమ చికిత్స చేసి స్పృహలోకి తెప్పించిన వైద్యురాలు



గాయపడిన యువకుడికి సేవలందిస్తున్న స్థానికులు

ఆరిలోవ: జాతీయ రహదారిపై ఓ యువకుడు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా.. మధురవాడ వైపు నుంచి ఓ యువకుడు ఆదివారం ఉదయం నగరానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. జూ పార్కు సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. కిందపడటంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. అధికంగా రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అదే సమయంలో అటుగా ప్రయాణిస్తున్న ఓ వైద్యురాలు యువకుడికి ప్రథమ చికిత్స చేయడంతో స్పృహలోకి వచ్చాడు. అనంతరం అంబులెన్స్ రప్పించి ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆ వైద్యురాలిని పలువురు వాహన చోదకులు అభినందించారు. ఈ సంఘటనతో వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం కలిగింది. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి బాగానే ఉన్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తప్పవని ఫోర్తుటౌన్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వేలి ముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి షాపుల వద్ద అల్లరి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రసుత్తం యాక్టివ్‌గా ఉన్న వారిపై సీరియస్ అయ్యారు. మంచిగా ఉంటే మంచిగా ఉంటాను.. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గొడవలకు పాల్పడడం, బెదిరింపులకు దిగడం చేస్తే చర్యలు తప్పన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, నర్సింగరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తగాదాలకు దిగితే కఠిన చర్యలు..

రౌడీ షీటర్లు అల్లర్లు చేయకుండా ఉండాలని ద్వారకా సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రోజువారీ విధానాలపై ఆరా తీశారు. కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుంది కనుక శాంతియుతంగా జీవించాలని హితవు పలికారు.



సేవలకు ఇక సెలవ్..

వైద్యం అవసరమైన వారిని ఆస్పత్రికి తరలించే అంబులెన్స్‌లు ఎటూ కదలక నిరుపయోగంగా పడి ఉన్నాయి. కేజీహెచ్ పార్కింగ్ స్థలంలో కనిపించిన ఆ వాహనాలు ఏళ్ల నుంచి సర్వీసులో లేనట్లు తుప్పు పట్టి కనిపించాయి.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



స్వచ్ఛ సాగరం కోసం..

ఫిషింగ్ హార్బర్ సాగర జలాల్లో వ్యర్థాల తొలగింపు కార్యక్రమం ముమ్మరంగా జరుగుతోంది. విశాఖపట్నం పోర్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగింది.

- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్
9010133346
Office mail : sakshiadvtvsp@gmail.com